సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 28 । జనవరి । 2025



నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం చిదేళ్ళ సాయి కృష్ణ (కృష్ణా జిల్లా కపిలేశ్వరం) రూ.లక్ష విరాళం అందజేశారు.




చొల్లంగి తీర్థం చూసొద్దాం రండి!

కరప మండలం ఉప్పలంక శివారు మొండి వద్ద సముద్ర తీరాన బుధవారం జరిగే చొల్లంగి అమావాస్య తీర్థానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

8లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 9,355 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,900, మధ్య డెల్టాకు 1,755, పశ్చిమ డెల్టాకు 4,700 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.25 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

హుండీల ద్వారా స్వామికి రూ.39,02,348 ఆదాయం



అంతర్వేది ఆలయంలో హుండీ ఆదాయం లెక్కింపు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో సోమవారం నిర్వహించిన హుండీల లెక్కింపు ద్వారా స్వామికి భక్తుల నుంచి మొత్తం రూ.39,02,348 ఆదాయం వచ్చింది. డిసెంబర్ 6 నుంచి జనవరి 27వ తేదీ వరకూ 53 రోజులకు గానుపై ఆదాయం సమకూరింది. ఎండోమెంట్స్ అమలాపురం తనిఖీదారు జె.రామ లింగేశ్వర రావు పర్యవేక్షణలో లెక్కింపు చేశారు. కాగా మొత్తం ఆదాయంలో మెయిన్ హుండీల ద్వారా రూ.38,29,465, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.16,780, అన్నదానం హుండీల ద్వారా రూ.56,103 ఆదాయం వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.

రేపు స్పార్స్ అవుట్‌రీచ్ కార్యక్రమం

కాకినాడ సిటీ: మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులు, మాజీ సైనిక సంఘాల ప్రతినిధులకు బుధవారం స్పార్స్ అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఆ రోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ ఈ కార్యక్రమం రాజమహేంద్రవరం రివర్ బేలో జరుగుతుంది. అలహాబాద్‌కు చెందిన సీడీఏ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సమస్యలు ఎదుర్కొంటున్న ప్రతి మాజీ సైనికులు, వితంతువులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

'నన్నయ' పీడీసీఎంఏ ఉపాధ్యక్షుడిగా నాయుడు



బాపన్నాయుడు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ ప్రైవేటు డిగ్రీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (పీడీసీఎంఏ) సాధారణ సమావేశంలో అమలాపురం పట్టణానికి చెందిన ఆకుల బాపన్నాయుడు ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. స్థానిక విద్యానిధి డిగ్రీ కళాశాల డైరెక్టర్ అయిన బాపన్నాయుడు పీడీసీఎంఏ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల ఆక్నా పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రైవేటు డిగ్రీ కళాశాలల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నాయుడు పేర్కొన్నారు.

ఆక్వా చెరువులపై సర్వే

అమలాపురం రూరల్: తీర ప్రాంత ఆక్వా జోన్, ఆక్వాయేతర జోన్‌లో ఎంత మేర విస్తీర్ణంలో ఆక్వా చెరువులు ఉన్నది జియో కోఆర్డినేటర్ల మ్యాపులతో సహా బృందాలు సర్వే చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మత్స్య అధికారులు, ఆర్డీవోలతో సమావేశం నిర్వహించి ఆక్వా చెరువుల అనుమతుల అంశాలపై సమీక్షించారు. వారంలో సర్వే పూర్తి చేయాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని జేసీ నిషాంతి కమిటీ సభ్యులకు సూచించారు. సోమవారం ఇంటర్మీడియెట్ బోర్డు ఎగ్జామినేషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకు, ఒకేషనల్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు రెండు సెషన్స్‌లో నిర్వహిస్తారన్నారు. ఒక సెషన్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మరొకటి మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారన్నారు. జనరల్ ప్రాక్టికల్ కోసం 60 కేంద్రాలు, వోకేషనల్ ప్రాక్టికల్ కోసం 41 కేంద్రాలు కేటాయించి నట్లు తెలిపారు.

వేతనాలు చెల్లించాలని యానిమేటర్ల ధర్నా

అమలాపురం రూరల్: గత ఎనిమిది నెలలుగా బకాయి పడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ వెలుగు యానిమేటర్ల యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో వెలుగు యానిమేటర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.జ్యోతి, సీఐటీయూ కోశాధికారి కృష్ణవేణి మాట్లాడుతూ 8 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉంటే యానిమేటర్ల కుటుంబాలను ఎలా నెట్టుకు రావాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వినతి పత్రాన్ని డీఆర్‌ఓ రాజకుమారికి అందజేశారు. లక్ష్మి, సుబ్బలక్ష్మి, వేణు, విజయ పాల్గొన్నారు.

ఆగని దోపిడీ



ఆత్రేయపురం మండలం వద్దిపర్రు వద్ద ర్యాంపుల నుంచి నేరుగా లారీల మీద రవాణా అవుతున్న ఇసుక

- కోనసీమ జిల్లాలో అధికార రీచ్‌లు 15
- నిబంధనలకు విరుద్ధంగా ర్యాంపుల్లో తవ్వకాలు
- పగటి పూట సక్రమం... రాత్రి వేళల్లో అక్రమం
- లారీకి అదనంగా రూ.1,500 నుంచి రూ.5 వేల వరకు వసూళ్లు
- వినియోగదారులపై అదనపు భారం
- ఆత్రేయపురంలో చెలరేగిపోతున్న మాఫియా

సాక్షి, అమలాపురం: 'తవ్వుకున్న వారికి తవ్వుకున్నంత... దోచుకున్నవారికి దోచుకున్నంత' అన్నట్టుగా ఉంది కూటమి పాలనలో ఉచిత ఇసుక పాలసీ. పగలు, రాత్రి అనే తేడా లేదు.. అధికార ర్యాంపు.. అనధిరార ర్యాంపు అనే భేదం లేదు, ఎక్కడైనా వసూళ్ల దందా పెద్ద ఎత్తున నడుస్తోంది. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ర్యాంపుల్లో కూడా అడ్డగోలు దోపిడీ సాగిపోతోంది. దీనివల్ల వినియోగదారులకు ఉచిత ఇసుక కాస్తా కొనలేనంత భారంగా మారింది. కోనసీమ జిల్లాలో అధికారికంగా ప్రకటించిన ర్యాంపులు మొత్తం 15. జిల్లాస్థాయి శాండ్ కమిటీ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో తొలి దశలో అంకంపాలెం, నార్కెడిమిల్లి, పొడగట్లపల్లి-1, పొడగట్లపల్లి-2, పులిదిండి, వద్దిపర్రు -1, వద్దిపర్రు-2, ఆలమూరు, ఆత్రేయపురం, కపిలేశ్వరపురం, తాతపూడి, ఊబలంక కలిపి మొత్తం 12 ర్యాంపులు అనుమతించగా, రెండోదశలో గోపాలపురం, అంకంపాలెం-2, పొడగట్లపల్లి-3, మూడు ర్యాంపులున్నాయి. వీటిలో మిథులా కంపెనీ టెండర్ దక్కించుకున్న పొడగట్లపల్లి-2, ఆలమూరు రీచ్‌లలో ఇప్పటి వరకు ఎటువంటి తవ్వకాలు జరగడం లేదు.

యథేచ్ఛగా నిబంధనలకు పాతర

వీటిలో రెండు రీచ్‌లు మినహా మిగిలిన పదమూడు రీచ్‌లు కొత్తపేట నియోజకవర్గంలో ఉన్నాయి. రెండు మాత్రం మండపేట నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. ఈ రెండు చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు ఉండడంతో ఆ పార్టీకి చెందిన నేతల హవా కొనసాగుతోంది. ర్యాంపులు దక్కించుకున్నవారితో స్థానిక నాయకులు చేతులు కలిపారు. వారి కనుసన్నలలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. కూటమిలో ఉన్న జనసేన సైతం తమకు వాటా కావాలని పట్టుబట్టడంతో వారికి రెండు, మూడు లారీలు అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఇక్కడ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన ర్యాంపులే ఉన్నా నిబంధనలకు విరుద్ధం జరగాల్సిన పనులన్నీ జరుగుతున్నాయి. ర్యాంపుల్లో యంత్రాలతో తవ్వకాలు, గట్ల చెంతన నిల్వ చేయకుండా నేరుగా ర్యాంపుల నుంచే రవాణా చేయడం సర్వసాధారణంగా మారిపోయింది.

జట్టు కార్మికులు ఆందోళన చేసినా పట్టని అధికారులు

మండపేట పరిధిలో మందపల్లి, కపిలేశ్వరపురంలో యంత్రాలతో లోడింగ్ చేస్తున్నారు. రాత్రి సమయంలోనూ తవ్వకాలు జరుపుతున్నారు. దానితో ఆగ్రహం చెందిన జట్టు కార్మికులు ఈనెల 7న ర్యాంపు వద్ద వాహనాలను నిలుపుదల చేసి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. తమకు పని లేదని పంపివేసి యంత్రాలతో లోడింగ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా అటు మైనింగ్ అధికారులు గాని, ఇటు రెవెన్యూ సిబ్బంది, పోలీసులు కాని అడ్డుకున్న దాఖలాలు లేవు. అధికార పార్టీ కీలక నేతల అండదండలు ఉండడం, తిలాపాపం తలాపిడికెడు అన్నట్టుగా కింద నుంచి పై వరకు ప్రతి ఒక్కరికీ ఈ దందాలో సొమ్ము అందుతుండడంతో కిక్కురుమనకుండా ఉంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆత్రేయపురంలో చెలరేగిపోతున్న మాఫియా

ఆత్రేయపురంలో అధికార ర్యాంపు వద్ద టీడీపీ అనుకూల ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. పగటిపూట కొన్ని ర్యాంపులలో సక్రమంగా, రాత్రి వేళ **అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెం, నార్కెడిమిల్లి, పులిదిండి, వద్దిపర్రు, ఆత్రేయపురం గ్రామాల్లో ఉన్న ఎనిమిది రీచ్‌లలోనూ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపో**తున్నాయి. ఈ రాంపుల్లో కాంట్రాక్టర్లు, స్థానిక నాయకులతో వాటాలు పంచుకుంటున్నారు. వీరికి కీలకనేత అండదండలు ఉండడంతో అధికార యంత్రాంగం చేష్టలుడి చూస్తోంది. ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాలకు పెద్దపెద్ద బాటలు వేసి తవ్వకాలు చేస్తున్నారు. ర్యాంపుల వద్ద నుంచే రోజూ వందలాది లారీల ఇసుక తరలిపోతోంది. స్టాక్ పాయింట్‌ల వద్ద ఇసుక కన్నా రెట్టింపు సంఖ్యలో ర్యాంపుల నుంచి నేరుగా ఇసుక తరలిపోతోంది. ఇలా తరలిస్తున్న ఇసుకకే అదనంగా సొమ్ము వసూలు చేస్తున్నారు. ఉచిత ఇసుక అయినా పగటిపూట లారీకి రూ.వెయ్యి చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. రాత్రులు అంకంపాలెం, వద్దిపర్రు నుంచి అక్రమ తవ్వకాలు చేస్తూ లారీకి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, డిమాండ్‌ను బట్టి రూ.ఐదు వేల వరకు వసూలు చేస్తున్నారు. మిగిలిన ర్యాంపులు ఊబలంక, పొడగట్లపల్లి రాంపుల్లో పగటి పూట మాత్రమే తవ్వకాలు నిర్వహిస్తున్నారు. కాని ఇక్కడ కూడా లారీకి అదనంగా రూ.వెయ్యి నుంచి రూ.1,500 చొప్పున వసూలు చేస్తున్నారు. నియోజకవర్గంలో కీలక మద్యం వ్యాపారులే ఇక్కడ ఇసుక దందా కూడా చేస్తుండడం గమనార్హం. వీరి అక్రమ రవాణాకు డెల్టాలో కీలకమైన లొల్ల లాకులు సైతం దెబ్బతింటున్నాయి.



రావులపాలెం మండలం పొడగట్లపల్లి ర్యాంపు వద్ద స్టాక్ పాయింట్ నుంచి ఇసుక ఎగుమతి



కపిలేశ్వరపురం ర్యాంపు వద్ద యంత్రాలతో తవ్వకాలు వద్దని ధర్నా చేస్తున్న జట్టు కూలీలు (ఫైల్)

ఉల్లంఘనులపై చర్య తీసుకోండి



కపిలేశ్వరపురం ర్యాంపులో యంత్రాలతో ఇసుక తవ్వకాలు

ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న కపిలేశ్వరపురం ర్యాంపు నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదని, నిషేధిత యంత్రాలను వినియోగించి నది ఒడ్డున ఎన్‌జీటీ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు అందింది. అరిగెల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదులో ఇక్కడ పలు అక్రమాలు జరుగుతున్నాయని తెలిపాడు. ర్యాంపుల నుంచి ట్రాక్టర్లు, ట్రాలీల నుంచి ఇసుక స్టాక్ పాయింట్‌కు తరలించాల్సి ఉండగా, నేరుగా ర్యాంపుల నుంచి ఇసుక తరలిస్తున్నారన్నారు. సరైన బిల్లులు లేదా రికార్డులు లేకుండా పగటిపూట దాదాపు 150 లారీలు, రాత్రి వేళల్లో 100 లారీల ఇసుక రవాణా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా లారీ పరిణామాన్ని బట్టి రూ.ఆరు వేల నుంచి రూ.18 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలకు సంబంధించి జియో కోట్స్ ఫొటోలను, వీడియోలను సాక్ష్యాలుగా అందించిన ఆయన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

గణతంత్ర వేడుకల్లో ముక్కామల కళాకారులు

– మూడో ఏడాది కూడా పాల్గొన్న నాగబాబు బృంద సభ్యులు

అంబాజీపేట: దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన 76వ గణతంత్ర వేడుకల్లో మూడో ఏడాది కూడా ముక్కామలకు చెందిన నాగబాబు బృందం కళాకారులు పాల్గొన్నారు. 2025 గణతంత్ర వేడుకలలో ఆంధ్రప్రదేశ్ శకటంగా పర్యావరణ హితం కల్గించే ఏటి కొప్పాక బొమ్మలను ప్రదర్శించారు. ఈ బొమ్మలలో విఘ్నాలను తొలగించే వినాయకుడు, కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి బొమ్మలతో పాటు ఇతర బొమ్మలు ఉన్నాయి. శకటానికి ఇరువైపులా మండలంలోని ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబు బృందంలోని 16 మంది సభ్యులు భరత నాట్యం ప్రదర్శన నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. కాగా నాగబాబు బృందం సభ్యులు 2023లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకాదశ రుద్ర ప్రభల నమూనా శకటంతో గరగ నృత్యాలు చేసి అందరినీ అలరించారు. 2024 గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రదర్శించిన అక్షరాస్యతా శకటానికి ఇరువైపులా విద్యార్థుల మాదిరిగా నాగబాబు బృందం సభ్యులు పాల్గొన్నారు. దీంతో నాగబాబు బృందం సభ్యులు హ్యాట్రిక్ సాధించారు. ఈ సందర్భంగా పలువురు నాగబాబును, అతని బృంద సభ్యులను అభినందించారు.



రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ఏటి కొప్పాక బొమ్మల శకటంలో పాల్గొన్న నాగబాబు బృందం

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దారుణం

ఈరన్న కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకుడు శ్రీరామ్

అమలాపురం టౌన్: కర్నూలు జిల్లా ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కురమ ఈరన్నను హత్య చేయడం దారుణమని జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం ముఖ్య నాయకుల సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం నాయకుడు కాశీ శ్రీరామ్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశం ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్యను తీవ్రంగా ఖండించింది. ఈరన్న కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని సమావేశం డిమాండ్ చేసింది. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై సమావేశం చర్చించింది. ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు అరికట్టాలని సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేసింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, కార్యదర్శి నూకల బలరామ్ ఫీల్డ్ అసిస్టెంట్ నాయకులతో సమస్యలపై చర్చించారు. సంఘ ప్రతినిధులు డి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాస్, మద్దా రమేష్ ప్రసంగించారు.

గడువులోగా అర్జీల పరిష్కారం

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో అందే ప్రతి అర్జీని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఆయన అర్జీదారుల సమస్యలను విని అందుబాటులో ఉన్న సంబంధిత అధికారులకు పరిష్కరించాలని సూచించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి డీఆర్‌ఓ రాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ ఎ.శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్.త్రినాథరావు కృష్ణమూర్తి 212 అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల సమన్వయంతో జియో కోఆర్డినేటర్లతో మ్యాపులను రూపొందించాలని ఆదేశించారు.

రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, విద్యాసంస్థలు, వాటర్ ట్యాంకులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, సైక్లోన్ పునరావాస కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సబ్ స్టేషన్లు తదితర అంశాలపై మ్యాపులను చిత్రీకరించాలని ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం వద్ద స్వామివారి తిరుకల్యాణోత్సవాలకు సంబంధించి జిల్లాస్థాయి అధికారులతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు, వికాస జిల్లా మేనేజర్ జి. రమేష్ పాల్గొన్నారు.



పీజీఆర్‌ఎస్‌లో దివ్యాంగుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పోలీస్ గ్రీవెన్స్‌కు 34 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 34 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రీవెన్స్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలతో ఎస్పీ అక్కడ నుంచే ఫోన్లలో మాట్లాడి పరిష్కార మార్గాలపై ఆదేశాలు ఇచ్చారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి సమస్యపై తీసుకున్న పరిష్కార చర్యలను ఎస్పీ కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులపై ఎస్పీ బాధితులతో చర్చించి పరిష్కార మార్గాలపై మాట్లాడారు.

పూలు విలవిలలాడేనని..

- నగానికి పైగా తగ్గిన ధరలు
- మరోవైపు గణనీయంగా దిగుబడి
- రేటు లేక తోటల్లోనే వదిలేస్తున్న రైతులు
- ఉపాధి దొరకక కూలీలు, మహిళలకు ఇబ్బందులు

పెరవలి: కొద్ది రోజులుగా మార్కెట్‌లో పూల ధరలు పడిపోవటంతో రైతులు విలవిలలాడుతున్నారు. మరోవైపు పూలకోత కూలీలు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో కడియపులంక తరువాత చెప్పుకోదగిన కాకరపర్రు పూల మార్కెట్టు నేడు పూలు కొనేవారు లేక కళావిహీనంగా కనిపిస్తోంది. ప్రస్తుతం శుభ ముహూర్తాలు, పండగలు లేకపోవటంతో పూల వినియోగం తక్కువగా ఉందని, అందువల్లనే ధరలు తగ్గాయని చెబుతున్నారు. ప్రస్తుతం దిగుబడి ఉన్నా తగినంత ధర లేక రైతులు.. ఉపాధి దొరకక కూలీలు.. అమ్మకాలు లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో, నిత్యం కళకళలాడుతూ కనిపించే కాకరపర్రు పూల మార్కెట్టు నేడు వెలవెలబోతోంది.

దిగులు పెంచిన దిగుబడి

జిల్లావ్యాప్తంగా 4,897 ఎకరాల్లో రైతులు పూల సాగు చేస్తున్నారు. దీనిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. కొద్ది రోజులుగా వాతావరణం చల్లగా, అనుకూలంగా ఉండటంతో పూల దిగుబడి గణనీయంగా పెరిగింది. సాధారణంగా ఎకరానికి, కోతకు సుమారు 300 కేజీల బంతిపూల దిగుబడి వస్తూంటుంది. అటువంటిది ప్రస్తుతం 400 కేజీల వరకూ వస్తోంది. అలాగే, చామంతి పూలు కూడా సాధారణంగా 100 కేజీల లోపు వస్తూంటుంది. ప్రస్తుతం ఇది 125 నుంచి 150 కేజీల వరకూ వస్తోంది. ఈవిధంగా దిగుబడి పెరిగిన తరుణంలో రైతులు, వ్యాపారులు ఆనందంగా ఉండాలి. కానీ, సరిగ్గా ఇదే సమయంలో సంక్రాంతితో పండగలన్నీ ముగిసిపోవడం.. శుభముహూర్తాలు లేకపోవడంతో ప్రస్తుతం పెద్ద మొత్తంలో పూలు కొనేవారే లేకుండా పోయారు.

పూల ధరలు పడిపోయాయిలా..
(కిలోకు రూ.లలో)

పూల రకం	20 రోజుల క్రితం	ప్రస్తుతం
బంతి	80.00-120.00	40.00
చామంతి	300.00	60.00-80.00
జాజులు	350.00	150.00
కనకంబరాలు	1,000.00	500.00
మల్లెలు	1,000.00	500.00
గులాబీలు	350.00	150.00

నిత్య పూజలు, ఇతర చిన్న చిన్న అవసరాలకు తప్ప చాలా మంది పూలు కొనడం లేదు. దీంతో వాటి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. మామూలుగా వారానికి రెండు కోతలు కోయాల్సి ఉండగా.. నేడు ధర లేకపోవడంతో ఒక్క కోతతోనే సరిపెడుతున్నామని రైతులు చెబుతున్నారు. కోత కోయిస్తే కనీసం కూలి ఖర్చులు కూడా రావడం లేదని, కోత కోసి నష్టపోయేకంటే కోయకుండా వదలివేయడమే మేలని పలువురు రైతులు భావిస్తున్నారు.

రోడ్ల పక్కన పారబోస్తూ..

ఇరవై రోజుల క్రితం కిలో చామంతి, జాజుల ధర రూ.300 పలికింది. నేడు పూల నాణ్యతను బట్టి కిలో రూ.60 నుంచి రూ.120కి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అవి కూడా వ్యాపారుల వద్ద రెండు మూడు రోజుల పాటు నిల్వ ఉండిపోతున్న పరిస్థితి. అప్పటికీ అమ్ముడుపోకపోతే పూలు పాడైపోవడంతో గత్యంతరం లేక వాటిని నాలుగో రోజున రోడ్ల పక్కన పారబోస్తున్నామని వ్యాపారులు వాపోతున్నారు. పూల మాలలు అల్లించడం, గ్రేడింగ్ వంటి పనులు చేయిద్దామన్నా కనీస కూలి ఖర్చులు కూడా రావడం లేదని చిరు వ్యాపారులు వాపోతున్నారు.

కూలి ఖర్చులు కూడా రాక..

ధరలు తగ్గటంతో రైతులు కోతలు కోయించకుండా పూలను చేలల్లో వదిలేస్తున్నారు. గతంలో ప్రతి రోజూ పది మంది కూలీలతో పూల కోతలు కోయించే రైతులు నేడు వారానికి ఒక్కసారి మాత్రమే కోత కోయిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎకరా బంతి పూల తోటలో ఒక్క కోతకు 10 మంది కూలీలు అవసరమవుతారు. వీరికి రోజుకు రూ.350 కూలి ఇవ్వాలి. మార్కెట్లో కిలో పూల ధర రూ.40 పలుకుతోంది. ఒక విడతకు సుమారు 100 కిలోలు కోయిస్తే కూలీలకు రూ.3,500, కాఫీ, టిఫిన్లు, సంచులు, రవాణా కలిపి రూ.1,000 ఖర్చు అవుతుంది. ఈ లెక్కన 100 కిలోల బంతిపూలకు రూ.4 వేల రాబడి వస్తే.. ఖర్చు రూ.4,500 అవుతోంది. ఇతర పూల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంటోంది. దీంతో, చేతి ఖర్చు అదనంగా పడుతూండటంతో కోత కోయించకుండా వదిలేస్తున్నామని రైతులు వాపోతున్నారు. పూల కోత కోసే కూలీలకు ప్రస్తుతం వారానికి ఒక్క రోజు మాత్రమే పని లభిస్తోంది.



కొనేవారు లేక : కాకరపర్రులో నర్సాపురం కాలువ గట్టున వ్యాపారులు పారబోసిన పూలు

'భారత రాజ్యాంగం' పుస్తకావిష్కరణ



భారత రాజ్యాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీబీ లోక్, డాక్టర్ సుబ్బారావు తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, అంబేడ్కరీయులు, బుద్దిస్ట్ సవేర 'భారత రాజ్యాంగం' పేరుతో రచించిన పుస్తకాన్ని స్థానిక వెంకట కృష్ణాపురంలో ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది డీబీ లోక్ తదితరులు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్‌సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ సభలో డీబీ లోక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని అనేక విషయాలు పాఠకులందరికీ సులువుగా అర్థమయ్యే రీతిలో కవి సవేర సరళంగా రచించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముంగండ ఆశీర్వాదం, సరెళ్ల రామచంద్రరావు, పాలమూరి వెంకటేశ్వరరావు, ముత్తాబత్తుల ఆనందరావు, కొల్లు ఉదయకుమార్‌లు పుస్తకాన్ని సమీక్షించారు.

క్లుప్తంగా

బంగారు ఆభరణాల స్వాధీనం

నిందితుడి అరెస్టు



కోటనందూరు పోలీసు స్టేషన్లో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చెన్నకేశవరావు, ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: దొంగిలించిన 100 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్టు తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై టి.రామకృష్ణతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 24న కోటనందూరు మండలం బిళ్లనందూరుకు చెందిన మాతిరెడ్డి గంగయ్యమ్మ ఇంటికి తాళం వేసి ఉపాధి పనులకు వెళ్లింది. గంగయ్యమ్మ ఎదురింటి వ్యక్తి బొత్స వీరబాబు (34) తాళం పగులగొట్టి పడకగది బీరువాలో ఉన్న 35.30 గ్రాముల నల్లపూసల గొలుసు, 22.5 గ్రాముల పుస్తెలతాడు, 23.2 గ్రాముల చైను, 12.5 గ్రాముల చెవిదిద్దులు, 5.5 గ్రాముల బంగారు ముక్కలను అపహరించాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు వీరబాబు ఆదివారం టీజే నగరం బస్టాండు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా ఎస్సై రామకృష్ణ, సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా టీజే నగరం వర్మీకంపోస్టు కేంద్రం వద్ద రహదారి కింద ఉన్న కల్వర్టులో ఆభరణాలను దాచినట్లు అంగీకరించాడని పోలీసులు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పెరటిహిట్టు!



సాధారణంగా చెరకు గెడ 10 నుంచి 12 అడుగులు పెరుగుతుంది. అచ్చన్నపాలెంలో కొండపాముల సుబ్బారావు ఇంటి పెరట్లో దాదాపు 20 అడుగులకు పైగా ఎదిగి చూపరులను అబ్బుర పరుస్తోంది. సారవంతమైన నేల, గాలి, వెలుతురు, ఆహారం, ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే తోటల్లో కూడా ఇదేవిధంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారి బి.సోమశేఖరం తెలిపారు.

– నల్లజర్ల

చొల్లంగి తీర్థం చూసొద్దాం రండి!

- రేపు జరిగే తీర్థానికి భారీ ఏర్పాట్లు
- తరలి రానున్న వేలాది మంది భక్తులు

కరప: పురాణ ప్రసిద్ధి గాంచిన చొల్లంగి అమావాస్య తీర్థం బుధవారం కరప మండలం ఉప్పలంక శివారు మొండి వద్ద సముద్ర తీరాన జరగనుంది. చొల్లంగి తీర్థం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ప్రాముఖ్యత సంతరించుకుంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి సముద్రస్నానం చేయడం ఆనవాయితీ. దేవదాయ, పోలీసు శాఖలతో పాటు, ఉప్పలంక గ్రామ పంచాయతీ సంయుక్తంగా తీర్థం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా పుష్యమాసంలో అమావాస్య రోజున తీర్థం జరుగుతుంది. తుల్యభాగ నదీపాయ సముద్రతీరంలో కలిసే ప్రదేశమే సాగర సంగమం అంటారు. చంద్రుడు శాపవిమోచనం పొందడానికి తనభార్య రోహిణితో కలసి ఈ సాగర సంగమం వద్ద శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేయడంతో శివుడు ప్రత్యక్షమై మోక్షం కలిగించినట్టు పురాణగాథలు తెలుపుతున్నాయి. చొల్లంగి వద్ద సుమారు నాలుగు వేల సంవత్సరాల క్రితమే రాజ రాజేశ్వరీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. మొండివద్ద సముద్రతీరాన 109 సంవత్సరాల క్రితం మల్లాడి సత్యలింగం నాయకర్ సంగమేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో బాలాత్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఆలయానికి పక్కనే సీతారాముల ఆలయం, ఆంజనేయస్వామి, కాలభైరవస్వామి వార్ల ఆలయాలు కూడా ఉంటాయి. తర్వాత పక్కనే ఉన్న చొల్లంగిలో చంద్రుడు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరి సమేత సోమేశ్వరస్వామివారి శివలింగాన్ని భక్తులు దర్శించుకుంటారు. అమావాస్య రోజున సముద్రస్నానం చేస్తే మోక్షం కలుగుతుందని భక్తుల విశ్వాసం. కాకినాడ జిల్లానుంచే కాకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి సముద్రస్నానం చేసి సంగమేశ్వరస్వామి, భైరవస్వామి, సోమేశ్వరస్వామివార్లను దర్శించుకుంటారు.



మొండిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)



చొల్లంగి శివాలయం వద్ద అప్పన్నెద్దును ప్రదక్షిణ చేయిస్తున్న దృశ్యం (ఫైల్)



ఉప్పలంక శివారు మొండివద్ద సంగమేశ్వరస్వామి ఆలయంలోని బాలాత్రిపుర సమేత సంగమేశ్వరస్వామి



చొల్లంగి వద్ద చంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగం

ట్రాఫిక్ మళ్లింపు

చొల్లంగి తీర్థం రోజున ఎంఎస్ఎన్ చార్టీస్ నుంచి మొండివద్ద స్నానాల రేవు వరకు ఉండే భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల సూచన మేరకు ట్రాఫిక్‌ను ఒక రోజు(మంగళవారం అర్ధరాత్రి నుంచి) మళ్లించినట్టు కరప ఎస్ఐ సునీత తెలిపారు. యానాం వైపు నుంచి తాళ్లరేవు మీదుగా వచ్చే వాహనాలు పటవల వద్ద నుంచి జి.వేమవరం, గొర్రిపూడి, పెనుగుదురు గ్రామాల మీదుగా కాకినాడకు చేరుకుంటాయన్నారు. కాకినాడ నుంచి తాళ్లరేవు, యానాంవైపు వెళ్లే వాహనాలు కాకినాడ, తూరంగి, నడకుదురు, గురజనాపల్లి గ్రామాల మీదుగా యానాం రోడ్డుకు చేరుకుని వెళతాయన్నారు. స్నానాల రేవు వద్ద, ఆలయం వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవదాయ, పోలీసుశాఖల అధికారులతో కలసి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉప్పలంక సర్పంచ్ బొమ్మిడి నయోమి, గ్రామకార్యదర్శి ఎం.భవానీ తెలిపారు. స్నానాలరేవు వద్ద గజ ఈతగాళ్లను ఉంచినట్టు, దర్శనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్టు ఎంఎస్ఎన్ చార్టీస్ ఏసీ కె.విజయలక్ష్మి తెలిపారు. మొండివద్ద చొల్లంగి తీర్థం రోజున ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు కరప పీహెచ్‌సీ డాక్టర్ యాంజలిన్ తెలిపారు.

సప్తసాగర యాత్ర

చొల్లంగి అమావాస్య మరుసటి రోజు నుంచి సప్త సాగర యాత్ర ప్రారంభమవుతుంది. చొల్లంగి, కోరంగి, తీర్థాల మొండి, రామేశ్వరం, బ్రహ్మసమాఖ్యం, నాసంగితిప్ప, అంతర్వేదిలలో సముద్రస్నానం చేస్తే సప్త సాగర యాత్ర పూర్తవుతుంది. సప్త సాగర యాత్ర తర్వాత అంతర్వేదిలోని లక్ష్మీ నరసింహస్వామి తీర్థం జరుగుతుంది.

చంద్రునికి శివుడు ప్రత్యక్షమైనప్పుడు నందేశ్వరునికి కూడా వరమివ్వడం వల్లనే చొల్లంగి అమావాస్య రోజున అప్పన్నెద్దులను తీసుకొచ్చి సముద్రస్నానం చేయిస్తారు. గ్రామాల్లోని వీరభద్రుడు గద్దెల నుంచి ప్రభలను తీసుకొచ్చి చొల్లంగి తీర్థం రోజున సముద్రస్నానం చేసి, సంగమేశ్వరస్వామి, భైరవస్వామి, సోమేశ్వరస్వామివార్లను దర్శించుకుంటారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యాన కరప ఎస్ఐ టి.సునీత పోలీసు సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

అమలాపురం నడిబొడ్డున రెండు చోరీలు

- పట్టణ సీఐ కార్యాలయం ఎదుటే ఘటన
- రూ.1.30 లక్షల నగదు దోచుకున్న దొంగలు



చోరీ జరిగిన పత్రిక కార్యాలయంలో దొంగల వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పట్టణ సీఐ కార్యాలయానికి ఎదురుగా ఉన్న పత్రికా కార్యాలయం, చాందిని క్లినిక్‌లో ఈ వరస చోరీలు జరిగాయి. పత్రిక కార్యాలయం తలుపు తాళాలు, క్లినిక్ ఇనుప షట్టర్ల తాళాలు పగులగొట్టి దొంగలు లోనికి ప్రవేశించారు. పత్రిక కార్యాలయంలో డ్రాయర్ తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రూ.85 వేల నగదు, క్లినిక్‌లో డాక్టర్ ఎంకే రాయ్‌కు చెందిన రూ.45 వేల నగదు, ఓ ఏటీఎం కార్డును దొంగలు తస్కరించారు.

తెల్లారే సరికి విజయవాడకు

చోరీకి పాల్పడిన వారు ప్రొఫెషనల్స్‌గా పోలీసులు భావిస్తున్నారు. తెల్లారే సరికి వారు విజయవాడకు వెళ్లిపోయినట్లు తెలిసింది. ఇక్కడ క్లినిక్‌లో చోరీ చేసిన డాక్టర్ ఏటీఎం కార్డును విజయవాడలో ఉపయోగించి నగదు డ్రా చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఇక్కడ డాక్టర్ ఫోన్‌కు డబ్బు డ్రా అయినట్లు కాకుండా డబ్బుల కోసం రాంగ్ పిన్ నొక్కినట్టు మెసేజ్ వచ్చింది. దీనిని బట్టే చోరీకి పాల్పడ్డ దొంగలు తెల్లారే సరికి విజయవాడ చేరుకున్నట్లు బాధితులతోపాటు పోలీసులు కూడా భావించారు. పట్టణ సీఐ పి.వీరబాబుతోపాటు సిబ్బంది సోమవారం ఉదయమే చోరీలు జరిగిన చోటకు చేరుకున్నారు. క్లూస్ టీమ్ సభ్యులు చోరీలు జరిగిన చోట్ల నుంచి దొంగల వేలి ముద్రలను సేకరించారు.

కిర్లంపూడిలో సొసైటీలో రూ. 104.18 కోట్లు స్వాహా



మహాజన సభలో మాట్లాడుతున్న శ్రీరంగనాయకులు

మహాజన సభలో వెల్లడించిన సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ శ్రీరంగనాయకులు

కిర్లంపూడి: దొరికితే దొంగలు... దొరకకపోతే దొరలు అన్నచందంగా కిర్లంపూడి వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్లు, అధికారుల తీరు ఉందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయవలసిన అధికారులు, ప్రజాప్రతినిధులు చేతివాటం చూపిస్తే రైతులు ఎవరికి చెప్పుకోవాలి. సొసైటీలో జరిగే ప్రతి లావాదేవీకి బాధ్యత వహించవలసిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో కిర్లంపూడి సొసైటీ అధికారులు, చైర్మన్లు కుమ్మక్కై, బినామీ పేర్లతో రూ.104.18 కోట్లు కాజేశారు. తీసుకున్న సొమ్ముకు సొసైటీలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతు బాకీ ఉన్నట్లు చూపించి నోటీసులు జారీ చేయడంతో అసలు గుట్టు బయట పడింది. దీంతో 2012 నుంచి 2024 వరకు జరిగిన సొసైటీ గారడీలను బయటపెట్టేందుకు పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి కె.పద్మ 18 నెలల పాటు సుదీర్ఘ విచారణ చేపట్టి గత సంవత్సరం డిసెంబర్ 28న ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీంతో సోమవారం స్థానిక ది కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యాలయం వద్ద ప్రత్యేక అధికారి, సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ శ్రీరంగనాయకులు ఆధ్వర్యంలో మహాజన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.104.18 కోట్లు సొసైటీ సొమ్ము పక్కదారి పట్టిందన్నారు. ఈ సొమ్మును పక్కదారి పట్టించిన మాజీ చైర్మన్లు ఎ.సూర్యకుమారి, సీహెచ్ రాజ్‌కుమార్, ప్రత్తిపాడు బ్రాంచ్ డీసీసీబీ మాజీ మేనేజర్లు పి.మురళీ కృష్ణ, వైవీఎస్ నాగేశ్వరరావు, ప్రత్తిపాడు బ్రాంచ్ డీసీసీబీ సూపర్‌వైజర్లు వీవీడీఆర్ ప్రసాద్, జేవీ మోహన్‌రావు, ఎం.నరసింహంమూర్తిని బాధ్యులను చేస్తూ వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెడతామన్నారు. 14 వందల రైతులకు సంబంధించి సుమారు 30 రుణాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

రుణాలు మాఫీ చేయాలి

తీసుకోని రుణాలు చెల్లించాలంటూ ఇప్పటివరకు తమను అధికారులు మానసికంగా వేధించారని రైతులు అన్నారు. రైతులపై ఉన్న రూ.30 కోట్ల రుణాలను మాఫీ చేయాలని అధికారులను కోరారు. ఒకవేళ రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేయలేకపోతే సొసైటీ సొమ్మును కొల్లగొట్టిన వారి నుంచి రూ.104.18 కోట్లు రికవరీ చేసిన తరువాతే తమ రుణాలు చెల్లిస్తామని రైతులు అధికారులకు తెలిపారు.

క్రికెట్ ఆడిన డాక్టర్లు



చాంపియన్ షిప్ టైటిల్‌ను గెలుచుకున్న ఐఎంఏ కోనసీమ శాఖ జట్టు డాక్టర్లు

విజేతగా కోనసీమ ఐఎంఏ

అమలాపురం రూరల్: ఎంత సేపూ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలతో బిజీగా ఉండే డాక్టర్లు క్రికెట్ క్రీడలో చెలరేగిపోయారు. స్థానిక కిమ్స్ వైద్య కళాశాల క్రీడా స్థలంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) కోనసీమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రిపబ్లిక్ డే కప్–2025 ఉల్లాసంగా జరిగింది. ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకూ ఫ్లడ్ లైట్ల వెలుగులో పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీల్లో మొత్తం మూడు జట్లు తలపడ్డాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోనసీమ శాఖ, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) రాజమహేంద్రవరం శాఖ, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కోనసీమ శాఖ జట్లతో లీగ్ మ్యాచ్‌ల విధానంలో జరిగాయి. ఐఎంఏ కోనసీమ శాఖ, రాజమహేంద్రవరం ఐడీఏ జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ ఫైనల్ పోటీల్లో ఐఎంఏ కోనసీమ శాఖ విజేతగా నిలిచి చాంపియన్ షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఐడీఏ కోనసీమ శాఖ అధ్యక్షుడు డాక్టర్ బీవీఎస్వీ ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ డి.సత్య సునీల్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. చివరగా ఫైనల్ విజేత జట్టు అయిన ఐఎంఏ కోనసీమ శాఖకు చెందిన వైద్యులు ఆదివారం రాత్రి ఆ క్రీడా స్థలంలో కేరింతలు కొట్టి వేడుక జరుపుకున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	16,000 – 16,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పారా వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షురాలు శివదత్, ప్రశాంతి

తుని: స్థానిక రాజా కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి పారా వాలీబాల్ పోటీలను సోమవారం అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు దుర్గా ప్రశాంతితో కలిసి అసోసియేషన్ అధ్యక్షుడు బోడపాటి శివదత్ ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 100 మంది దివ్యాంగులు పోటీలకు హాజరయ్యారు. మంగళవారం సాయంత్రంతో పోటీలు ముగుస్తాయని, ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. వీరు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. తునిలో తొలిసారి జరుగుతున్న దివ్యాంగుల వాలీబాల్ పోటీలను ప్రజలు ఆసక్తికరంగా తిలకించారు.

కొట్లాట కేసులో నిందితుడి అరెస్టు



కాకినాడ జీజీహెచ్‌లో బాధితుడిని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన కొట్లాట కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ నెల 24న మండలంలోని బిళ్లనందూరు గ్రామానికి చెందిన మిరియాల నాగు తన తమ్ముడు మిరియాల నానాజీపై కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నానాజీని కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్సకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నానాజీ కోమాలోకి వెళ్లాడు. సోమవారం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నానాజీ కుటుంబ సభ్యులను ఎస్సై పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం బిళ్లనందూరులో మధ్యవర్తుల సమక్షంలో నిందితుడు నాగును అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మండపేటలో యూపీ పోలీసుల విచారణ

మండపేట: ఏడాది క్రితం మండపేటకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కాశీ తీర్థయాత్రలకు వెళ్లి కాటేజీలో కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటున్నామని, తమను కొంతమంది వేధింపులకు గురిచేశారంటూ ఆ సమయంలో సూసైడ్ నోట్ రాసి భార్యాభర్తలతో సహా ఇద్దరు కుమారులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన అప్పట్లో మండపేటలో సంచలనం రేకెత్తించింది. అప్పటి టౌన్ ఎస్ఐ మద్దాల అశోక్‌కుమార్ యూపీ పోలీసులు అందించిన సమాచారంతో మండపేటలో కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆ కేసుకు సంబంధించి యూపీ నుంచి పోలీసులు మండపేట వచ్చి విచారణ చేపట్టారు. వారణాసిలోని దశాశ్వమేథ్ పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు వచ్చి మండలంలో విచారణ చేశారు. స్థానిక పోలీసుల సహకారంతో ఇప్పనపాడు, మండపేటలోను యూపీ పోలీసులు పర్యటించి విచారణ చేశారు. సూసైడ్ లేఖలో పేర్కొన్న పెంటగట్ల ప్రసాద్, మల్లికార్జునరావు, వీరలక్ష్మణరెడ్డి నివాసాలకు వెళ్లి విచారించారు. నిందితుల ఆస్తుల జప్తునకు వారణాసి కోర్టు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు.

డ్రెయిన్‌లో పడి వ్యక్తి మృతి

అల్లవరం: బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ డ్రెయిన్‌లో పడి మృతి చెందిన ఘటన కొమరగిరిపట్నం శివారు కొడపలో చోటు చేసుకుంది. కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన జగతా సత్యనారాయణ (44) శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ డ్రెయిన్‌లో పడిపోయాడు. సోమవారం ఉదయం స్థానికులు సత్యనారాయణ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు.

ఇంటి ముందు భార్య బైఠాయింపు



బాధిత మహిళ సత్యవతితో మాట్లాడుతున్న మహిళా సరంక్షణ కార్యదర్శి సత్యనారాయణమ్మ

ఆలమూరు: తన భర్తతోనే జీవనం సాగిస్తానని, తనను ఇంట్లోకి ఆహ్వానించకుంటే ఇంటి ముందు నుంచి కదిలేది లేదంటూ భార్య ఆలమూరు మండలంలోని పినపళ్లలో నిరసన తెలిపింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో నివసిస్తున్న ఇల్లూరి రవికుమార్‌కు 2022 మే 21న వివాహమైంది. ఏడాది దాటాక భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో రవికుమార్ తన భార్య సత్యవతిని మండపేట మండలంలోని ఏడిదలో పుట్టింటికి పంపేశాడు. అప్పటి నుంచి పలుమార్లు పెద్దల ద్వారా రవికుమార్‌తో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో భార్య సత్యవతి సోమవారం తన భర్త ఇంటి బయట బంధువులతో కలిసి బైఠాయించింది. ఇంట్లోకి రమ్మనే వరకూ ఇంటి ముంగిటనే ఉంటానని తెలిపింది. దీనిపై స్థానికులు స్థానిక మహిళ సంరక్షణ కార్యదర్శి కె.సత్యనారాయణమ్మకు ఫిర్యాదు చేయగా ఆమె ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆలమూరు ఎస్సై ఎం.అశోక్‌కు ఆమె సమాచారం అందించారు.

కౌన్సెలింగ్ ఇస్తాం : రెండేళ్ల నుంచి విడిపోయి ఉంటున్న భార్యాభర్తలిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి వారి సమస్యను పరిష్కరిస్తామని ఎస్సై అశోక్ తెలిపారు. నిరసన వీడి పోలీసు స్టేషన్‌కు రావాలని బాధిత మహిళ సత్యవతికి, కుటుంబ సభ్యులకు ఫోన్‌లో వివరించారు. భర్త రవికుమార్ స్పందించకుంటే చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం స్థానికుల సాయంతో బాధిత కుటుంబాన్ని మహిళా సంరక్షణ కార్యదర్శి సత్యనారాయణమ్మ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

గ్యాస్ గోడౌన్‌లో చోరీ

96 డొమెస్టిక్ సిలిండర్ల అపహరణ

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి సమీపంలో గ్యాస్ గోడౌన్‌లో చోరీ జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై బి.జగన్మోహన్ రావు సోమవారం తెలిపారు. తొండంగి గ్రామంలో నిర్వహిస్తున్న హెచ్‌పీ గ్యాస్ కంపెనీ గొడౌన్ ఒంటి మామిడి సమీపంలోని కృష్ణాపురం జంక్షన్ వద్ద నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి యథావిధిగా గోడౌన్ లాక్ చేశారు. సోమవారం ఉదయం గోడౌన్ తెరిచేందుకు సిబ్బంది వెళ్లి చూడగా తాళాలు పగులు గొట్టి ఉండటంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గోడౌన్‌ను ఎస్సై జగన్మోహన్‌రావు పరిశీలించారు. డొమెస్టిక్ సిలిండర్లు 96, కమర్షియల్ ఖాళీ సిలిండర్లు మూడు చోరీకి గురయ్యాయన్నారు. వీటి విలువ రూ.3.5 లక్షలు ఉంటుందని తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

సోనోవిజన్ లక్కీ డ్రాలో మారుతి ఆల్టో కారు



సోనోవిజన్ లక్కీడ్రాలో విజేతలను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): సోనోవిజన్ కొనుగోలుదారులకు రిపబ్లిక్ డే సేల్ సందర్భంగా సోమవారం స్థానిక జేఎన్ రోడ్డులోని షోరూంలో లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు ఖరీదైన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొనుగోలుదారుల సమక్షంలో లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఎస్.అన్నపూర్ణ (కూపన్ నంబర్ 017607) మారుతి ఆల్టో కారు గెలుపొందగా, కె.చైతన్య (కూపన్ నంబర్ 03376) ఎల్‌ఈడీ టీవీ గెలుచుకున్నారు. అఖిల్ కుమార్ (కూపన్ నంబర్ 84452) రిఫ్రిజిరేటర్‌ను గెలుపొందగా, అల్లం కుమార్ (కూపన్ నంబర్ 017647) వాషింగ్ మెషీన్‌ను గెలుచుకున్నారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



నదిలో తేలియాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొవ్వూరు: ఆరికిరేవుల గ్రామంలోని బ్రాహ్మణరేవులో గోదావరి నదిలో తేలియాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. సుమారు 35–40 ఏళ్ల వయస్సు ఉండవచ్చునని భావిస్తున్నారు. వీఆర్వో ఎం.శంకరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితి మృతి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి మార్చురీకి తరలించినట్టు తెలిపారు. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

CHANGE OF NAME

I, Venkayapanda Lingupanda, son of Satyanarayana Lingupanda, born on 15/03/1969, residing at 4-1-105G, Tharaka Ramarao Nagar, Pithapuram, Kakinada, Andhra Pradesh, 533450, have changed my name to Venkayya Panda Lingupanda vide affidavit dated 27/01/2025, at Pithapuram, Kakinada, Andhra Pradesh. [HA-08211]

GOLD FINANCE



బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2593]

Wanted

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికిస్త్రీలు/పురుషులు,ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు – 40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD. 96662 53675 [HA-99631]

సాయిరామ్ హోంకేర్: Hydలో బేబీ కేర్, పేషెంట్‌కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు/నర్సులు, ఇంటి పని/వంట పనికి మనుషులు (ఆడ/మగ) కావ లెను. జీతం 18,000/- 9666001826, 9666001827 [SCA25001357]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

నాలుగు లైన్లకు రూ. : 400/-

అదనపు లైనుకు రూ. : 90/-

GST 5% Extra

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.

ఫోన్స్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.